బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ రోజు రోజుకి పతనమైపోతోంది. ధరాభారం ప్రజల జేబుల్ని గుల్ల చేస్తోంది. పెరుగుతున్న ధరలకి తగ్గట్టుగా ఆదాయాలు పెరగకపోవడంతో ప్రజలకి కొనుక్కొని తినే స్తోమత కూడా కరువు అవుతోంది.దీంతో సమాజంలోని వివిధ వర్గాలు వేతనాల పెంపు డిమాండ్‌తో సమ్మెకు దిగుతున్నాయి. ప్రపంచంలోని మిగిలిన అభివృద్ధి చెందిన దేశాలు ఈ ఏడాది ఆర్థికంగా పుంజుకుంటే బ్రిటన్ మరింత క్షీణిస్తుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) అంచనా వేస్తోంది. ఆర్థిక మాంద్యం ఎదుర్కోక తప్పదని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రతో చమురు లభ్యత చాలా దేశాలకు అతి పెద్ద సమస్యగా మారింది. అమెరికా తన సొంత గడ్డపై లభించే శిలాజ ఇంధనాలపై ఆధారపడితే, ఫ్రాన్స్ అణు విద్యుత్‌పైనా, నార్వే జలవిద్యుత్‌పైన ఆధారపడ్డాయి. యూకే గ్యాస్‌పైనే ఆధారపడే దేశం కావడంతో విద్యుత్ బిల్లులు తడిసిమోపెడైపోయాయి. ఒకానొక దశలో 100% పెరిగాయి. దేశం ఆర్థికంగా కుదేలు కావడానికి ఇంధనం అసలు సిసలు కారణమని ఫిస్కల్ స్టడీస్ ఇనిస్టిట్యూట్ డిప్యూటీ డైరెక్టర్ కార్ల్ ఎమ్మర్‌సన్ అభిప్రాయపడ్డారు.

బ్రెగ్జిట్ దెబ్బ...

ప్రపంచదేశాలు కరోనా, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం వంటి సంక్షోభాలను ఎదుర్కొంటే బ్రిటన్ ఆర్థిక సమస్యలకు బ్రెగ్జిట్ అదనపు కారణంగా నిలిచింది. 2016లో యూరోపియన్ యూనియన్ నుంచి బయటకు వచ్చినప్పటి నుంచీ దేశానికి ఆర్థిక సమస్యలు మొదలయ్యాయి. బ్రెగ్జిట్ కారణంగా యూకే ఆర్థిక వ్యవస్థకు ఏడాదికి ఏకంగా 10 వేల కోట్ల పౌండ్ల నష్టం వాటిల్లుతోందని బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. దీర్ఘకాలంలో బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ 4 శాతానికి తగ్గుతుందని తెలిపింది. 2021 జనవరి నుంచి బ్రిటన్ నుంచి ఈయూకు ఎగుమతులు 16% పడిపోయాయి. ఈయూ నుంచి వచ్చే పెట్టుబడులు 2,900 కోట్ల పౌండ్లు తగ్గిపోయాయి.

శ్రామికులు కావలెను...



బ్రెగ్జిట్ ముందు వరకు ఈయూ నుంచి బ్రిటన్‌కి స్వేచ్ఛగా పని చేయడానికి వచ్చేవారు. ఇప్పుడు వర్కర్లు రావడం మానేశారు. ఫలితంగా ఆతిథ్యం, వ్యవసాయం, సేవా రంగాల్లో సిబ్బంది కొరత ఏర్పడింది. యువత పని చేయడం కంటే ఉన్నత చదువులపై దృష్టి పెడుతూ ఉంటే, వయసు మీద పడ్డ వారు ముందస్తుగా పదవీ విరమణ చేస్తున్నారు. అత్యధికులు రోగాల పాలై ప్రభుత్వం నుంచి లబ్ధి పొందుతున్నారే తప్ప పని చేసే వారి సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. ఇవన్నీ దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయి.

డాలర్‌తో పౌండ్ విలువ **0.83**



బ్రిటన్ జీడీపీ వృద్ధి రేటు అంచనా **-0.6%**



ద్రవ్యోల్బణం **10.1%**



• శివరాత్రి శోభ



మహాశివరాత్రి సందర్భంగా శనివారం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో గంగా-యమున-సరస్వతి నదుల త్రివేణి సంగమం ప్రాంతంలో పవిత్ర స్నానాలు చేస్తున్న భక్తులు

జీఎస్టీ ఫైలింగ్ ఆలస్య రుసుము తగ్గింపు



న్యూఢిల్లీ: జీఎస్టీ వార్షిక రిటర్నుల ఫైలింగ్ ఆలస్య రుసుమును హేతుబద్ధీకరిస్తూ జీఎస్టీ మండలి 49వ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను నమోదిత వ్యక్తులు ఫామ్ జీఎస్‌టీఆర్–9కు సంబంధించి రూ.5 కోట్ల వరకు టర్నోవర్ ఉంటే ఆలస్య రుసుము రోజుకు రూ.50, రూ.5–20 కోట్ల టర్నోవర్ ఉంటే రోజుకు రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ రుసుము రూ.200 ఉంది. పన్ను చెల్లింపుదార్లకు ఉపశమనం కలిగించడానికి ఫామ్ జీఎస్‌టీఆర్–4, ఫామ్ జీఎస్‌టీఆర్–9, ఫామ్ జీఎస్‌టీఆర్–10లో పెండింగ్‌లో ఉన్న రిటర్నులకు సంబంధించి షరతులతో కూడిన మినహాయింపు లేదా ఆలస్య రుసుము తగ్గించడం ద్వారా క్షమాభిక్ష పథకాలను జీఎస్టీ మండలి సిఫార్సు చేసింది.

రాష్ట్రాలకు పరిహార బకాయిలు..

2022 జూన్‌కు సంబంధించి రాష్ట్రాలకు చెల్లించాల్సిన జీఎస్టీ పరిహార బకాయిలు రూ.16,982 కోట్లు, అలాగే ఆరు రాష్ట్రాలకు మరో రూ.16,524 కోట్లు విడుదల చేస్తున్నట్టు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రకటించారు. కేంద్రం తన సొంత వనరుల నుంచి ఈ మొత్తాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకుందని, భవిష్యత్తులో పరిహార రుసుము వసూళ్ల నుంచి ఈ మొత్తాన్ని తిరిగి పొందుతామని ఆమె చెప్పారు. దీంతో జీఎస్టీ చట్టం 2017 ప్రకారం ఐదేళ్ల కాలానికి తాత్కాలికంగా అనుమతించదగిన మొత్తం పరిహార బకాయిలను కేంద్రం క్లియర్ చేస్తుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటన వెల్లడించింది. రాష్ట్రాలు వారి అకౌంటెంట్ జనరల్ నుంచి సర్టిఫికేట్‌లను ఇచ్చినప్పుడు పెండింగ్‌లో ఉన్న ఏవైనా పరిహార రుసుము మొత్తాలను వెంటనే క్లియర్ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. పరిహార బకాయి కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.689 కోట్లు, తెలంగాణకు రూ.548 కోట్లు సమకూరనున్నాయి.

బెల్లం పానకంపై తగ్గింపు..

ఇక విడిగా విక్రయించే బెల్లం పానకంపై ప్రస్తుతం 18 శాతం ఉన్న జీఎస్టీ ఎత్తివేస్తూ మండలి నిర్ణయం తీసుకుంది. ప్యాక్, లేబులింగ్ చేసి బెల్లం పానకం విక్రయిస్తే 5 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. పెన్సిల్ షార్ప్‌నర్స్‌కు 18 శాతం నుంచి జీఎస్టీని 12 శాతానికి చేర్చారు. పన్ను ఎగవేతలను అరికట్టడంతోపాటు పాన్ మసాలా, గుట్కా, నమిలే పొగాకు వంటి వస్తువుల నుండి ఆదాయ సేకరణను మెరుగుపరచడానికి గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ చేసిన సిఫార్సులను జీఎస్టీ మండలి ఆమోదించింది.

మోదీకి బానిసలా మారిన ఈసీ: ఉద్ధవ్



ముంబై: కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బానిసగా మారిపోయిందని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే ధ్వజమెత్తారు. శివసేనను అంతం చేయడం ఎవరి తరమూ కాదని బీజేపీ, మోదీ గుర్తుంచుకోవాలన్నారు. శివసేన పేరు, ఎన్నికల గుర్తు సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గానికే చెందుతాయని ఈసీ ప్రకటించిన నేపథ్యంలో ఠాక్రే శనివారం ముంబైలో తన వర్గం నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. పార్టీ పేరును, గుర్తును దొంగిలించిన వాళ్లకు, వారి యజమానులకు గుణపాఠం నేర్పిద్దామని పిలుపునిచ్చారు. ''ఎన్నికల్లో నెగ్గడానికి బాల్‌ఠాక్రే ఫొటో, పేరును మోదీ వాడుకున్నారు. ఈ ద్రోహులకు ఠాక్రే ఫొటో కావాలి గానీ ఆయన కుటుంబం అక్కర్లేదు. దొంగ (సీఎం షిండే)కు బుద్ధి చెప్పేదాకా విశ్రమించేదే లేదు. అతను తేనెతుట్టెపై రాయి విసిరాడు. తేనెటీగలు కుట్టడం తథ్యం. దొంగిలించిన విల్లు, బాణాన్ని మోయలేడు. శివధనస్సు ఎత్తలేకపోయిన రావణుడిలాగే కూలిపోతాడు'' అన్నారు.

'పరిపూర్ణత్వానికి దగ్గరగా కొలీజియం'

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో జడ్జీల నియామకం కోసం ఉద్దేశించిన కొలీజియం వ్యవస్థ ప్రస్తుతం పరిపూర్ణత్వానికి(పర్‌ఫెక్ట్ మోడల్) దగ్గరగా ఉందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు.లలిత్ చెప్పారు. న్యాయ వ్యవస్థలో నియామకాలు, సంస్కరణలపై సీజేఏఆర్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోర్టుల్లో జడ్జీల నియామకం కోసం పేర్లను ప్రతిపాదించడం వెనుక కఠినమైన ప్రక్రియ ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొలీజియం కంటే మెరుగైన వ్యవస్థ ఉంటుందని తాను అనుకోవడం లేదన్నారు. ప్రత్యామ్నాయం లేదు కాబట్టి కొలీజియంను కాపాడుకొనేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొలీజియంపై కేంద్ర ప్రభుత్వం, న్యాయ వర్గాల మధ్య వివాదం రగులుతున్న నేపథ్యంలో జస్టిస్ యు.యు.లలిత్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

18.82 లక్షల దీపాలతో గిన్నిస్ రికార్డు

ఉజ్జయిని: మహా శివరాత్రి సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని నగరంలో ఏకంగా 18,82,229 దీపాలు వెలిగించారు. గిన్నిస్ రికార్డు సృష్టించారు. శనివారం సాయంత్రం క్షిప్రా నది ఒడ్డున నిర్వహించిన ఈ కార్యక్రమంలో 20 వేల మంది వాలంటీర్లు పాల్గొన్నారు. 2022లో అయోధ్యలో అత్యధికంగా 15.76 లక్షల దీపాలు వెలిగించారు. ఉజ్జయినిలో గత శివరాత్రి సందర్భంగా 11,71,078 దీపాలు వెలిగించారు.

ముందెవరు ఐ లవ్యూ చెప్తారో?

విపక్ష ఐక్యతపై ఖుర్షీద్ • కాంగ్రెసే చెప్పుందని వెయిటింగ్: నితీశ్

పట్నా: బీజేపీని ఓడించేందుకు జాతీయ స్థాయిలో విపక్షాలు ఎంత త్వరగా ఒక్కతాటిపైకి వస్తే అంత మంచిదని కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. ''అయితే ఇందుకు ఎవరు ముందుగా చొరవ తీసుకోవాలన్నదే ప్రశ్న. ప్రేమలోనూ ఇలాంటి సందిగ్ధం అప్పుడప్పుడూ ఎదురవుతుంది. ఎవరు ముందు ఐ లవ్యూ చెప్పాలన్న ప్రశ్న తలెత్తుతుంది'' అంటూ చమత్కరించారు. శనివారం పట్నాలో జరిగిన సీపీఎం భేటీ ఇందుకు వేదికైంది. అందుకు కాంగ్రెసే తక్షణం చొరవ తీసుకోవాలని ఖుర్షీద్‌తో అందులో పాల్గొన్న జేడీ(యూ) నేత, బిహార్ సీఎం నితీశ్‌కుమార్, సూచించారు. ''మేం ఎదురు చూస్తున్నాం (వుయ్ ఆర్ వెయిటింగ్). ఈ విషయంలో ఇంకేమాత్రం ఆలస్యం కూడదు'' అన్నారు. ''రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ద్వారా వచ్చిన ఊపును పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. బీజేపీని వ్యతిరేకించే పార్టీలన్నింటితోనూ జట్టు కట్టాలి. తక్షణం ఈ పని జరగాలి'' అని సూచించారు. అలా విపక్షాలన్నీ కలసికట్టుగా రంగంలోకి దిగితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 100 సీట్లు కూడా రావని ఆయన జోస్యం చెప్పారు. త్వరలో ఢిల్లీ వెళ్లి రాహుల్‌తో పాటు కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీతో భేటీ అవుతానని నితీశ్ తెలిపారు. విపక్ష కూటమిలో ప్రాంతీయ పార్టీలకే కాంగ్రెస్ అధిక ప్రాధాన్యమివ్వాలని ఆర్జేడీ నేత, బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ సూచించారు!

మాజీ భార్యతోపాటు ఆరుగురి కాల్చివేత

అమెరికాలో 52 ఏళ్ల వ్యక్తి ఘాతుకం

ఆర్కాబుతాలా(యూఎస్): అమెరికాలో మరో ఘోరం జరిగిపోయింది. ఒంటరితనంతో బాధపడుతున్న ఓ వ్యక్తి తన మాజీ భార్య, సవతి తండ్రితో పాటు మరో నలుగురిని కాల్చి చంపాడు. ఉత్తర మిసిసిపీలో శుక్రవారం ఈ దారుణం చోటుచేసుకుంది. రిచర్డ్ డేల్ క్రమ్(52) తొలుత టెన్నెసీ స్టేట్ లైన్ సమీపంలోని ఆర్కాబుతాలా దుకాణంలో బయట ఓ వాహనంలో డ్రైవర్ సీట్లో కూర్చున్న వ్యక్తిని హ్యాండ్‌గన్‌తో కాల్చేశాడు. తర్వాత కొద్ది మైళ్ల దూరంలోని ఓ ఇంట్లోకి ప్రవేశించి, అక్కడున్న మాజీ భార్య, ఆమె భర్తపై తూటాల వర్షం కురిపించాడు. మాజీ భార్య మరణించగా భర్త గాయాల పాలయ్యాడు. అనంతరం మరో తన సవతి తండ్రి ఇంట్లోకి దూరి ఆయన్ను, ఆయన సోదరిని అంతం చేశాడు. తర్వాత తాపీగా నడుచుకుంటూ తన ఇంటి వెనుకకు చేరుకున్నాడు. రోడ్డుపై కనిపించిన ఓ వ్యక్తిపై, వాహనంలో కూర్చున్న మరొకరిని కాల్చి చంపాడు. పోలీసులు రంగంలోకి దిగి క్రమ్‌ను అతడి ఇంటి వద్దే అదుపులోకి తీసుకున్నారు. హత్య కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. కాల్పుల్లో ఆరుగురు మరణించడం పట్ల అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ప్రథమ మహిళ జిల్ బైడెన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. తుపాకీ చట్టాలను సంస్కరించడంపై ఇకనైనా దృష్టి పెట్టాలని కాంగ్రెస్‌కు జో బైడెన్ మరోసారి విజ్ఞప్తి చేశారు.

ఉగ్రవాదం తీవ్రవాదం 80% తగ్గాయి: అమిత్ షా



నాగపూర్: నరేంద్ర మోదీ హయాంలో కశ్మీర్‌లో ఉగ్రవాదం, ఈశాన్యంలో వామపక్ష తీవ్రవాదం 80 శాతం దాకా తగ్గుముఖం పట్టాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. శనివారం ఇక్కడ మరాఠా వార్తా లోక్‌మత్ స్వర్ణోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోదీకి ముందు దాకా దేశం పలు అంతర్గత భద్రతా సవాళ్లతో సతమతమవుతూ ఉండేదన్నారు. అలాంటిది గతేడాది కశ్మీర్ లోయను ఏకంగా 1.8 కోట్ల మంది పర్యాటకులు సందర్శించడం గొప్ప ఘనత అని అభిప్రాయపడ్డారు. ''అంతేగాక గత 70 ఏళ్లలో మొత్తం కలిపి కశ్మీర్‌కు రూ.12 వేల కోట్ల పెట్టుబడులు వస్తే గత మూడేళ్లలోనే మరో రూ.12 వేల కోట్ల పెట్టుబడులను మోదీ ప్రభుత్వం సాధించింది. పైగా కశ్మీర్‌లో ప్రతి ఇంటికీ నల్లా నీరు, కరెంటు అందించాం. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో కూడా వామపక్ష తీవ్రవాదం పూర్తిగా అదుపులోకి వచ్చింది. 60 శాతం ప్రాంతాల్లో సాయుధ దళాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని రద్దు చేశాం కూడా. రక్షణ రంగంలో దేశం స్వయంసమృద్ధంగా మారుతోంది. ఉపగ్రహ ప్రయోగాల్లో మనమెంతగా దూసుకెళ్తున్నదీ ప్రపంచమంతా చూస్తోంది. మన స్టార్టప్‌లు దుమ్ము రేపుతున్నాయి. ఇలా అన్ని రంగాల్లోనూ భారత్‌లో ప్రపంచంలో అత్యుత్తమ స్థానంలో చూడాలన్న ప్రధాని మోదీ ఆశయం నెరవేరేందుకు ఇంకెంతో దూరం లేదు'' అన్నారు. అందుకు తగ్గట్టుగా వచ్చే పాతికేళ్ల అమృత కాలంలో పలు లక్ష్యాలు పెట్టుకుని ముందుకెళ్తున్నట్టు వివరించారు.

సిసోడియాకు సీబీఐ పిలుపు

మద్యం కుంభకోణంలో నేడు విచారణ

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆప్ నేత మనీశ్ సిసోడియాను సీబీఐ ఆదివారం విచారణకు పిలిచింది. ఆయనపై విచారణ కొనసాగుతున్నందున ఇంకా నిందితుల జాబితాలో చేర్చలేదని సీబీఐ వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో గత అక్టోబర్ 17న సీబీఐ ఆయన్ను ప్రశ్నించడమే గాక ఇంటినీ, బ్యాంకు లాకర్లను కూడా శోధించింది.

కుంభకోణమే లేదు: కేజ్రీవాల్

మద్యం కుంభకోణమనేదే జరగలేదని ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఆప్‌పై కక్షసాధింపు చర్యల్లో భాగంగా మోదీ సర్కారు కుట్రపూరితంగా ఇలా లేని కుంభకోణాన్ని పుట్టించిందని ఆరోపించారు. ''అయితే విచారణకు మేం పూర్తిగా సహకరిస్తాం. చివరికి సత్యమే గెలుస్తుంది'' అన్నారు. కేజ్రీవాల్ వ్యాఖ్యలను బీజేపీ ఎద్దేవా చేసింది. ఏ కుంభకోణమూ జరక్కపోతే మద్యం విధానాన్ని ఎందుకు రద్దు చేసినట్టని ప్రశ్నించింది.

దక్షిణాఫ్రికా నుంచి 12 చీతాల రాక

• కునో జాతీయ పార్కుకు తరలింపు
• భారత్‌లో 20కి చేరిన చీతాల సంఖ్య

శివోపూర్: దక్షిణాఫ్రికా నుంచి 12 చీతాలు భారత వైమానిక దళం విమానంలో మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ ఎయిర్‌పోర్టుకు శనివారం ఉదయం 10 గంటలకు చేరుకున్నాయి. ఇందులో ఏడు మగవి, ఐదు ఆడ చీతాలు ఉన్నాయి. వీటిని 165 కిలోమీటర్ల దూరంలోని శివోపూర్ జిల్లా కునో జాతీయ పార్కు(కేఎన్‌పీ)లోని క్వారంటైన్ ఎన్‌క్లోజర్‌లో భద్రంగా వదిలారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర పర్యావరణ, అడవుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐదు నెలల క్రితం ఆఫ్రికా ఖండంలోని నమీబియా నుంచి 8 చీతాలను భారత్‌కు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ చీతాలను గత ఏడాది సెప్టెంబర్ 17న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కునో జాతీయ పార్కులో స్వయంగా వదిలారు. ఇవి ప్రస్తుతం అడవిలో సందడి చేస్తున్నాయి. తాజాగా తీసుకొచ్చినవాటితో కలిసి మన దేశంలో చీతాల సంఖ్య 20కు చేరుకుంది. వీటిలో 10 మగ, 10 ఆడ చీతాలు ఉన్నాయి. భారత్‌లో చీతాలు ఏడు దశాబ్దాల క్రితం పూర్తిగా అంతరించిపోయాయి. వీటిని మళ్లీ ప్రవేశపెట్టి, సంఖ్యను పెంచాలని 2009లో అప్పటి యూపీఏ ప్రభుత్వం సంకల్పించింది. కేంద్ర పర్యావరణ శాఖ మాజీ మంత్రి జైరామ్ రమేశ్ 'ప్రాజెక్ట్ చీతా'కు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆఫ్రికా ఖండం నుంచి చీతాలను తీసుకొచ్చేందుకు అక్కడి దేశాలతో భారత ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ఒక్కో చీతా కోసం రూ.2,48,296 (3,000 డాలర్లు) ఖర్చు చేసింది. చీతాలను 30 రోజులపాటు క్వారంటైన్‌లో ఉంచిన అనంతరం ఆరోగ్య పరిస్థితి సక్రమంగా ఉంటే అడవిలోకి వదిలేస్తారు.



కునో జాతీయ పార్కు క్వారెంటైన్ ఎన్‌క్లోజర్లో చీతా

గురువులకు శిక్షణ



అధ్యాపకులు, ఉపాధ్యాయులకు ఉన్నత విద్యా అంశాలపై శిక్షణ కార్యక్రమం శనివారం ఎస్‌ఎస్‌ఈలో జరిగింది. ఇందులో ఆంగ్ల విభాగానికి మదురై రిసోర్స్ పర్సన్లు, వ్యాఖ్యత డాక్టర్ జాన్ అధ్యాపక సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. – సాక్షి, చెన్నై



కొరుక్కుపేట: చెన్నై జార్జ్‌టౌన్‌లోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానంలో వేడుకలు



తిరుత్తణి: అన్నదానం చేస్తున్న ఉభయదారులు



చందన అలంకరణలో నొచ్చిలి గంగాధరేశ్వరర్



పురసైవాక్కం శివాలయంలో..



తిరుత్తణి: ప్రత్యేక అలంకరణలో శ్రీ శివశక్తి సిద్ధేశ్వరర్

శివోహం..!

శివనామ స్మరణతో రాష్ట్రంలోని శైవ క్షేత్రాలు శనివారం మారుమోగాయి. భక్తులు భారీగా తరలిరావడంతో శివాలయాలు కిక్కిరిసిపోయాయి. రాత్రి జాగారం చేసిన భక్తులు లింగోద్భవం సమయంలో ఆదిదేవుడిని దర్శించుకుని తన్మయత్వం చెందారు.

- భక్తజనసంద్రమైన శివ క్షేత్రాలు
- రాత్రంతా జాగారం చేసిన భక్తులు
- శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు

సాక్షి,చెన్నై: మహాశివరాత్రిని పురస్కరించుకుని రాష్ట్రంలోని శివాలయాల్లో శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే తలస్నానం చేసి ఉపవాస దీక్షతో శివ అష్టోత్తరం, శివ పంచాక్షరి స్తోత్రం, శివ సహస్ర నామాలు పారాయణం చేశారు. ఇక సాయంత్రం ఆలయాకు వెళ్లి రాత్రంతా జాగారం చేశారు.

ప్రధాన ఆలయాల్లో..

రాష్ట్రంలోని రామేశ్వరం రామనాథ స్వామి ఆలయం, కంచిలోని ఏకాంబరేశ్వర ఆలయం, మదురైలోని మీనాక్షి సోమ సుందరేశ్వర ఆలయం, తంజావూరు బృహదీశ్వర ఆలయం, తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయం, చిదంబరం నటరాజ స్వామి ఆలయం, కుట్రాలంలోని కుట్రాలనాథేశ్వరర్ ఆలయం, కోయంబత్తూరులోని పొల్లాచ్చి సుందరేశ్వరాలయం, కన్యాకుమారిలోని ధను మలయాన్ ఆలయం, కరూర్ జిల్లాలోని ఏకపురీశ్వరర్ ఆలయం...ఇలా రాష్ట్రంలోని అన్ని ప్రధాన శివ క్షేత్రాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి శివరాత్రి మహోత్సవ వేడుకల్లో తరించారు. రాష్ట్ర ప్రభుత్వం నేతృత్వంలోని 330 ఆలయాల్లో ప్రభుత్వం తరపున వేడుకలు నిర్వహించారు.



తిరువళ్లూరు: 41 అడుగుల శివలింగానికి క్రేన్ సాయంతో పాలాభిషేకం చేస్తున్న అర్చకులు

విశిష్ట పూజలు.. జాగారం

చెన్నై మైలాపూర్‌లోని కపాలీశ్వర ఆలయం, తీర్థ స్వామిశ్వర ఆలయం, వాలీశ్వర ఆలయం, తిరువాన్మీయూరు మరుదీశ్వర ఆలయం, వేళచ్చేరి శ్రీ దండీశ్వర ఆలయం, తిరువేర్కాడు వీరకత్తీశ్వర ఆల యం, వలసరవాక్కం వేల్వీశ్వరాలయం, పూందమల్లి వైదీశ్వరాలయం, పార్క్‌టౌన్‌లోని ఏకాంబరీశ్వరాలయం, వడపళని వేంగీశ్వరాలయం, సైదా పేట కారనీశ్వరాలయం, మింట్ దక్షిణామూర్తి ఆలయం, అనకాపుత్తూరులోని అగదీశ్వరాలయం, పాడిలోని వలిదీశ్వర ఆలయం, కోయంబేడు కురుందీశ్వరాలయం తదితర శైవ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు రుద్రాభిషేకాలు, ప్రత్యేక అభిషేకాలు, దీపారాధన చేశారు. సాయంత్రం 6గంటల నుంచి తొమ్మిది గంటలకు మొదటి విడత, తొమ్మిది నుంచి పన్నెండు వరకు రెండో విడత పూజ, పన్నెండు నుంచి మంగళవారం ఉదయం 3గంటల వరకు మూడో విడత, మూడు నుంచి నాలుగు గంటల వరకు నాలుగో విడత చొప్పున కాల పూజలు నిర్వహించారు. శివుడు, పార్వతీ మాత విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. వాహనాల్లో స్వామి, అమ్మవార్లను అధిష్టించి పుర వీధుల్లో ఊరేగింపులు చేపట్టారు. శివతాండం, శివుడి లీలన్ని చాటుతూ సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కోయంబత్తూరులోని ఈషాయోగా కేంద్రంలో వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఆధ్యాత్మిక గురువు జగ్గీ వాసుదేవ్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదియోగి విగ్రహం వద్ద భారీ వేదికపై శివరాత్రి వేడుకలు కనుల పండువగా సాగాయి.

పళ్లిపట్టు: మహాశివరాత్రి సందర్భంగా శనివారం పరమేశ్వరుడుకి విశిష్ట అభిషేక, ఆరాధన పూజలు నిర్వహించారు. నొచ్చిలిలోని గిరిరాజ కన్యకాపరమేశ్వరి సమేత గంగాధరేశ్వరర్ ఆలయంలో రుద్ర హోమం, సుగుంధ ద్రవ్యాలతో అభిషేకం చేపట్టారు. స్వామి వారు చందన అలంకరణలో భక్తులను కటాక్షించారు. పళ్లిపట్టు, ఆర్కేపేట నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయంకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం ఉభయదారులు కప్పూరుకండ్రిగకి చెందిన డి.చక్రవర్తినాయుడు 5 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. అలాగే కేజీ కండ్రిగలో చెంచమ్మకోనలో కొలువైన శివశక్తి సిద్ధేశ్వర ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. శివశక్తి ఆంజనేయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో 1008 శంఖులతో శివుడికి అభిషేక పూజలు, కరింబేడు నాదాధీశ్వరర్ ఆలయంలో విశేష పూజలు చేశారు.

భక్తిభావాన్ని చాటిన పరుగో పరుగు..

కన్యాకుమారిలో శివాలయం వైపుగా పరుగో పరుగుతో యాత్ర భక్తి భావంతో నిర్వహించారు. ఇక్కడి విలవంగోడు, కల్‌కులం పరిధిలో ప్రసిద్ధి చెందిన 12 శివాలయాలు ఉన్నాయి. ఇక్కడ మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం అర్ధరాత్రి వరకు నిర్వహించిన వేడుకలకుభక్తులు పరుగున వెళ్లి దర్శించుకున్నారు. తిరుమలై మహాదేవర్ ఆలయం నుంచి 110 కి.మీ దూరం ఈ యాత్ర సాగింది. మార్గంమధ్యలోని కాపుకాడు, సెన్నితొట్టం, పల్లన్ విళై, మార్తాండం మీదుగా తొలుత పర్యటించి తీకుచ్చిమహాదేవర్ ఆలయంలో పూజలు చేశారు. తర్వాత అరుమనై, కలియల్ తిరుప్పరపు వీర భద్ర ఆలయం, తిరునంది కరై ఆలయం, కులశేఖరం మార్గం గుండా ప్రయాణించి పొన్ మనై మహాదేవర్ ఆలయం, కల్‌కులం నీలకంఠ స్వామి ఆలయం, తిరువిడై కోడు సడయప్పర్ ఆలయాన్ని దర్శించుకున్నారు. చివరగా అమరావతి కోలిపోర్ విళై మీదుగా ప్రయాణించి మహాదేవర్ ఆలయంలో పూజలు నిర్వహించారు. దారిపొడవున భక్తులకు ప్రజలు, వివవిధ సంఘాలు సొంటి నీరు, వేరుశనగలు, పానకం, మజ్జిగ, గంజి, పండ్లను అందజేస్తారు. వేలాది మంది ఈ యాత్రలో పాల్గొనడంతో దారి పొడవున భక్తి భావం మిన్నంటింది.

వేలూరు, తిరువణ్ణామలైలో..

వేలూరు: మహా శివరాత్రిని పురస్కరించుకుని వేలూరు, తిరువణ్ణామలై జిల్లాలోని శివాలయాల్లో శనివారం విశేష పూజలు నిర్వహించారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని రాత్రంతా జాగారం ఉండి స్వామి వారిని దర్శించుకుంటే పునర్జన్మ భక్తుల నమ్మకం. అరుణాచలేశ్వర ఆలయంలో జాయింట్ కమిషనర్ అశోక్‌కుమార్ అధ్యక్షతన ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సంగీత కచ్చేరీలు నిర్వహించారు. ఆలయ రాజగోపురం ముందు నాదేశ్వర కచ్చేరి, నాట్యం ఏర్పాటు చేశారు. భక్తులు గిరివలయం వచ్చి సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఇదిలా ఉండగా శనివారం తెల్లవారు జామున 3 గంటలకు శివాచార్యులు ఆలయాన్ని తెరిచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పుష్పాలంకరణలు చేపట్టారు. అనంతరం భక్తులను స్వామి దర్శనానికి అనుమతించారు. ఉదయం 6 గంటలకు స్వామి వారికి పుష్పాలంకరణలు చేపట్టారు. అదేవిధంగా వేలూరు కోట మైదానంలోని జలకంఠేశ్వరాలయంలో శంఖాభిషేక పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



అరుణాచలేశ్వరాలయంలో శంఖాభిషేకానికి సిద్ధం చేసిన పుష్పాలు

తిరువళ్లూరులో..

తిరువళ్లూరు: తిరువళ్లూరు పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ బొమ్మి అమ్మవారి సమేత గురు ముత్తీశ్వరుడి ఆలయంలో శివరాత్రి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. మహా ప్రదోషం, అభిషేకం దీపారాధన నిర్వహించి నిర్మించిన 41 అడుగుల నాగలింగానికి 1,008 లీటర్ల పాలతో అభిషేకం నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. కాగా తిరువళ్లూరులోని తీర్థీశ్వరుడి ఆలయం, పేరంబాక్కం శోలీశ్వరుడి ఆలయం, కాశీవిశ్వనాథుడి ఆలయాల్లోనూ శివరాత్రి వేడుకలు జరిగాయి.

మీనాక్షి అమ్మవారి సేవలో రాష్ట్రపతి



మదురై మీనాక్షి ఆలయం వద్ద రాష్ట్రపతి ముర్ము, గవర్నర్ ఆర్ ఎన్ రవి, మంత్రి మనో తంగరాజ్ తదితరులు


- ద్రౌపది ముర్ముకు ఘన స్వాగతం
- ఈషా యోగా కేంద్రం వేడుకలకు హాజరు

సాక్షి, చెన్నై: ద్రౌపది ముర్ము రాష్ట్రపతిహోదాలో తొలిసారి శనివారం రాష్ట్ర పర్యటనకు వచ్చారు. ఆమెకు మదురై విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. దారి పొడవున ప్రజలు ఆమెకు ఆహ్వానం పలికారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో మదురైకు చేరుకున్న ఆమెకు రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి, మంత్రి మనో తంగరాజ్ తదితరులు ఘన స్వాగతం పలికారు. దారి పొడవన మదురై వాసులు ఆమెకు ఆహ్వానం పలికారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో మీనాక్షి అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ ఆర్‌ఎన్ రవికి ఆలయ అధికారులు పూర్ణకుంభ హారతి పలికారు. ఆలయంలో విశిష పూజలు నిర్వహించారు. మీనాక్షి, సుందరేశ్వర స్వామి వారిని దర్శించుకున్న అనంతరం అక్కడ జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి పాల్గొన్నారు. అనంతరం అక్కడి ప్రభుత్వ అతిథిగృహానికి బయలుదేరి వెళ్లారు. ఈ సమయంలో మార్గం మధ్యలో జనాన్ని చూసిన ఆమె తన కాన్వాయ్‌ను నిలుపుదల చేశారు. ప్రజల వద్దకు వెళ్లి పలకరించారు. ఈ సమయంలో అక్కడున్న పజలు భారత్ మాతాకీ జై.. అన్న నినాదాలను మారుమోగాయి. మధ్యాహ్నం తర్వాత మదురై నుంచి కోయంబత్తూరుకు బయలుదేరి వెళ్లారు. సాయంత్రం కోయంబత్తూరు తొండాముత్తురు రోడ్డులోని వెల్లంగిరిలోని ఈషా యోగా కేంద్రానికి వెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి శివరాత్రి వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్రపతి రాకతో మదురై, కోయంబత్తూరులో కనీవిని ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆదివారం నీలగిరిలోని వెల్లింగ్ టన్ ఆర్మీ శిక్షణ కేంద్రానికి రాష్ట్రపతి వెళ్లనున్నారు.

బీఎడ్ ప్రత్యేక విద్య ఎంట్రెన్స్ పరీక్షలు వాయిదా

తిరువొత్తియూరు: ఆదివారం నిర్వహించాల్సిన బీఎడ్ ప్రత్యేక విద్య ఆన్‌లైన్ ఎంట్రన్స్ పరీక్షలు ఈనెల 26కి వాయిదా వేస్తున్నట్లు తమిళనాడు ఓపెన్ యూనివర్సిటీ శనివారం ప్రకటించింది. వివరాలు.. తమిళనాడు ఓపెన్ యూనివర్సిటీ 2008వ సంవత్సరం నుంచి బీఎడ్ ప్రత్యేక విద్యా కోర్సును దూర విద్యా విధానం ద్వారా అందిస్తోంది. ఈ కోర్సు పూర్తి చేసేవారు ప్రభుత్వ, ప్రత్యేక, ప్రైవేటు, సీబీఎస్‌సీ పాఠశాలలు ఉపాధ్యాయులుగా పని చేయవచ్చునని 500 సీట్లు మాత్రమే కలిగి ఉన్న ఈ కోర్సుకు 1000 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం జరగవలసిన ఎంట్రన్స్ పరీక్షలు వాయిదా పడింది. 19వ తేదీ యూపీఎస్సీ సెంట్రల్ ఖగోళ శాస్త్రం సైంటిస్ట్ ప్రిలిమినరీ స్థాయి పరీక్షలకు ప్రకటన విడుదల చేయడంతో ఓపెన్ యూనివర్సిటీ బీఎడ్ ప్రత్యేక విద్య ఎంట్రన్స్ పరీక్షను వాయిదా వేశారు.

ఇల్లు.. జిగేలు



తెన్‌కాశిలో వింతగా నిర్మించిన ఇల్లు చూపరులను విస్మయానికి గురి చేస్తోంది. వెల్‌కమ్‌నగర్‌లో పేర్చబడిన అట్టపెట్టెలు కూలిపోతున్నట్టుగా కనిపించే ప్రత్యేక డిజైన్‌తో ఇల్లు కట్టారు. బాటసారులు ఈ అందమైన ఇంటిని చూసి ఆశ్చర్యపోతూ సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపుతున్నారు. - అన్నానగర్

సరిహద్దుల్లో ఉద్రిక్తత

- జాలరి మృతదేహం అప్పగింతకు నిర్ణయం
- మృతుడి కుటుంబానికి రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా

సాక్షి, చెన్నై : కర్ణాటక- తమిళనాడు సరిహద్దుల్లో శనివారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శుక్రవారం జాలరిని కర్ణాటక అటవీ సిబ్బంది కాల్చి చంపడాన్ని తమిళాభిమానులు, జాలర్ల సంఘాలు తీవ్రంగా పరిగణించాయి. శనివారం ఈ అంశం సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. వివరాలు.. సేలం జిల్లా మేట్టూరుకు చెందిన జాలరి రాజ కర్ణాటక అటవీ శాఖ సిబ్బంది తుపాకీ కాల్పుల్లో మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు తోడు కర్ణాటక సీఎం బసవరాజ బొమ్మ అసెంబ్లీ వేదికగా కావేరి నదీ జలాలు, మేఘదాతు డ్యాం నిర్మాణంపై చేసిన వ్యాఖ్యలు తమిళ సరిహద్దు గ్రామాల్లో ఉద్రిక్తత రాజేశాయి. జాలరి హత్యకు న్యాయం కోసం ఓ వైపు జాలర్ల సంఘాలు పోరుబాట పట్టాయి. మరోవైపు కావేరి వ్యవహారంపై కర్ణాటక సీఎం వైఖరికి వ్యతిరేకంగా రైతు సంఘాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది.

బస్సులకు భద్రత..

కర్ణాటక రూపంలో చోటు చేసుకున్న పరిణామాలతో రాష్ట్ర పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో భద్రతను పెంచారు. తమిళనాడు నుంచి కర్ణాటక వైపుగా వెళ్లే అన్ని మార్గాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. జాలరి మృతికి న్యాయం కావాలంటూ పోరాటం చేస్తున్న కుటుంబ సభ్యులు, జాలర్ల సంఘాలను పోలీసులు, జిల్లా స్థాయి అధికారులు బుజ్జగించారు. చివరకు మృతదేహం తీసుకునేందుకు కుటుంబ సభ్యులు నిర్ణయించడంతో ఆ వివాదం సద్దుమనిగింది. అయినా, జాలర్ల సంఘాలు తమ నిరసనను వీడక పోవడం, రైతు సంఘాలు ఆగ్రహంతో ఉండడంతో తమిళనాడులోకి వచ్చే కర్ణాటక బస్సులకు భద్రత కల్పించారు. అలాగే తమిళనాడు బస్సులపై కర్ణాటకలో ఎలాంటి దాడులు జరగకుండా అక్కడి పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. రెండు రాష్ట్రాల మధ్య ఎలాంటి వివాదం రాకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఇక జాలరి రాజ మృతిపై సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు.



మరణించిన జాలరి రాజ (ఫైల్)

వేలూరులో మినీ టైడల్ పార్క్

- రూ. 7,874 కోట్లతో పనులు
- 3 వేల మందికి ఉద్యోగాలు
- శంకుస్థాపన చేసిన సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: వేలూరులో మినీ టైడల్‌పార్క్ పనులకు సీఎం స్టాలిన్ శనివారం భూమి పూజ చేశారు. సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మరిన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ నెల మొదటి వారంలో ఫీల్డ్ సర్వే నిమిత్తం సీఎం వేలూరుకు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ సమయంలో ప్రజల విజ్ఞప్తుల మేరకు ఐటీ పరంగా ఈ జిల్లా పరిసరాలను అభివృద్ధి చేయడానికి సీఎం నిర్ణయించారు. ఇందుకోసం రూ. 7,874 కోట్లతో 4.98 ఎకరాల్లో టైడల్ పార్క్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. పలు సంస్థలు ఇక్కడ తమ పరిశ్రమలు, సంస్థలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యాయి. దీంతో ఈ నిర్మాణ పనులకు శనివారం ఉదయం సచివాలయం నుంచి సీఎం స్టాలిన్ శంకుస్థాపన చేశారు. వీటితో పాటు మరికొన్ని అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ టైడల్ పార్క్ ద్వారా 3 వేల మందికి పత్యక్షంగా ఉద్యోగాలు కల్పించనున్నట్లు సీఎం ప్రకటించారు.

రియల్ ఎస్టేట్ ప్రగతిపై సమీక్ష

చెన్నై నందంబాక్కంలో జాతీయస్థాయిలో క్రెడాయ్ నేతత్వంలో ఎక్స్ పో ఏర్పాటు చేసిన విషయం తెలిసింది. దీనిని శనివారం సీఎం స్టాలిన్ పరిశీలించారు. రియల్ ఎస్టేట్ రంగంలోకి ఒడిదుడుగులు, ప్రగతి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రియల్ ఎస్టేట్ రంగం ప్రగతిని, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా దూర దృష్టితో కూడిన సావనీర్‌ను సీఎం ఆవిష్కరించారు.





టైడల్ పార్క్ పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం



సావనీర్‌ను ఆవిష్కరిస్తూ..



సీఎంతో అన్బుమణి రాందాస్

సీఎంతో అన్బుమణి భేటీ..

పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాసు సచివాలయంలో సీఎం స్టాలిన్‌తో భేటీ అయ్యారు. పీఎంకే ఒత్తిడి మేరకు గత పాలకులు వన్నియర్లకు స్థానిక కోటాగా ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. ఈ స్థానిక కోటాకు రాష్ట్ర హైకోర్టు బ్రేక్ కూడా వేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాసు, ఆ పార్టీ శాసన సభా పక్ష నేత జీకేమణి, సీనియర్ నేత ఏకే మూర్తితో కలిసి సీఎం స్టాలిన్ కలిసికారు. వన్నియర్లకు గతంలో కేటాయించిన ప్రత్యేక రిజర్వేషన్ అమలుకు సంబంధించి చర్యలు తీసుకోవాలని, ఈ అంశంపై కోర్టులో బలమైన వాదనలు వినిపించాలని కోరారు.

ఆశ్రమం కేసు సీబీసీఐడీకి అప్పగింత

- విచారణకు ప్రత్యేక కమిషన్

సాక్షి, చెన్నై : విల్లుపురం ఆశ్రమ వ్యవహారం సీబీసీఐడీకి అప్పగిస్తూ డీజీపీ శైలేంద్రబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక మహిళా కమిషన్ కూడా ప్రత్యేక విచారణ బృందాన్ని రంగంలోకి దించింది. కాగా ఈ కేసును సీబీఐకి అప్పగించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కేంద్రాన్ని కోరారు. వివరాలు.. తీగ లాగితే డొంకంతా కదిలినట్లు విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపంలోని అన్బుజ్యోతి ఆశ్రమంలోని అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకి వస్తున్నాయి. ఇక్కడకు వచ్చే అనాథలు తరచూ అదృశ్యం పలు అనుమానాలకు దారి తీసింది. అభాగ్యుల నుంచి అవయవాలను ఓ ప్రైవేటు ఆసుపత్రి ద్వారా ఆశ్రమ నిర్వాహకులు అమ్ముకున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అలాగే తమ వాళ్లంటే తమ వాళ్లు కనిపించడం లేదంటూ ఆశ్రమ నిర్వాహకులపై ఫిర్యాదులు హోరెత్తుతున్నాయి. దీంతో కేసును సీబీఐడీకి అప్పగిస్తూ డీజీపీ శైలేంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. అదే సమయంలో కేంద్ర మహిళా కమిషన్ కూడా ఈ వ్యవహారంపై దృష్టి పెట్టింది. మహిళలపై లైంగికదాడులు తదితర వ్యవహారాల నేపథ్యంలో ప్రత్యేక కమిషన్ ద్వారా విచారణ చేపట్టాలని నిర్ణయించారు. ఆదివారం ఈ బృందం తన విచారణ చేపట్టనుంది. సీబీసీఐడీ, ప్రత్యేక కమిషన్ విచారణలో వెలుగు చూసే అంశాల మేరకు తదుపరి చర్యలకు ప్రభుత్వం సిద్ధం అవుతోంది. అదే సమయంలో ఈ కేసును సీబీఐకి అప్పగించాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈమేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కేంద్రానికి లేఖ రాశారు.



అన్బుజ్యోతి ఆశ్రమం

రూ.50 కోట్ల విలువైన భవనం స్వాధీనం

తిరువొత్తియూరు: కళ్లకురిచ్చి జిల్లా ఉలందూరుపేటలో పురాతన శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఉంది. చెన్నైకి వెళ్లే రోడ్డు సమీపంలో ఈ ఆలయానికి చెందిన రూ.50 కోట్లు విలువైన హోటల్, వాణిజ్య భవనాల సముదాయం ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణలో ఉంది. దీనికి సంబంధించి వచ్చిన పిటిషన్ మేరకు ఆ భూములను స్వాధీనం చేసుకొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. దీంతో దేవదాయ శాఖ కమిషనర్ శివకుమార్ నేతృత్వంలోని అధికారులు శనివారం ఆక్రమిత భవనాలను సీజ్ చేశారు. ఇకపై ఆక్రమణదారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు.

క్లుప్తంగా

అగ్గిపెట్టెల ఫ్యాక్టరీలో మంటలు

అన్నానగర్: శివకాశికి చెందిన మహేశ్వరన్‌కు చెందిన అగ్గిపెట్టెల కర్మాగారం సాత్తూరు – మన్నార్‌కోట్టై రహదారిపై ఉంది. ఇక్కడ 50 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఉద్యోగులంతా భోజనం చేసేందుకు వెళ్లారు. ఆ సమయంలో అగ్గిపుల్లల తయారీకి ఉపయోగించే పాత దుంగలు, రంపాలు ఉన్న గదిలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. రూ.లక్షల విలువైన వస్తువులు, గదిలోని దుంగలు కాలి బూడిదయ్యాయి. అదృష్టవశాత్తు కార్మికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని గంటల తరబడి శ్రమించి మంటలను ఆర్పారు. అమ్మాపట్టి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గల్ఫ్‌లో ఉద్యోగం పేరిట రూ.90 లక్షలు మోసం



అరెస్టయిన మీనాహాజీద్దీన్

తిరువళ్లూరు: గల్ఫ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి 49 మంది వద్ద సుమారు రూ.90 లక్షలు వసూలు చేసి ఉడాయించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా ఆవడి సమీపంలోని చేక్కాడు ప్రాంతానికి చెందిన మీనాహాజీద్దీన్(40). ఆరు నెలల క్రితం అల్ఫాత్ టూర్ అండ్ ట్రావెల్స్ పేరిట సంస్థను నడుపుతున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేశాడు. అలాగే గల్ఫ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.90 లక్షలు వసూలు చేశాడు. అనంతరం ఉద్యోగం ఇప్పించకుండా తరచూ కాలయాపన చేయడంతో మోసపోయామని గ్రహించిన కడలూరు జిల్లాకు చెందిన శైలేష్(31) పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆవడి పోలీసులు కేసు నమోదు చేసి రెండు నెలలుగా పరారీలో ఉన్న మీనాహజీద్దీన్‌ను అరెస్టు చేసి పూందమల్లి కోర్టు అనుమతితో రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా కళాసుధ శివరాత్రి మహోత్సవం

- గరికపాటికి గురుశ్రీ పురస్కారం, స్వర్ణ కిరీట ధారణ



హాజరైన తెలుగు ప్రముఖులు



గరికపాటి నరసింహారావును సత్కరిస్తున్న మండలి బుద్ధ ప్రసాద్, ఆస్కా అధ్యక్షులు కె.సుబ్బారెడ్డితో బేతిరెడ్డి శ్రీనివాస్

కొరుక్కుపేట: శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి మహోత్సవ వేడుకలను శనివారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన చెన్నై టీ.నగర్, విజయ రాఘవరోడ్డులోని ఆంధ్రాక్లబ్ (ఆస్కా)లో వేదికగా వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ ప్రవచన కర్త, పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావుకు గురుశ్రీ పురస్కారం, స్వర్ణ కిరీట ధారణ చేశారు. ముఖ్య అతిథిగా ఏపీ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, గౌరవ అతిథిగా ఆస్కా అధ్యక్షుడు డాక్టర్ కె.సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శివరాత్రి ప్రసంగాన్ని గరికపాటి నరసింహారావు చేస్తూ శివ నామస్మరణ ఎంతో శక్తివంతమైనదని నిత్యం శివ నామస్మరణతో అన్ని కష్టాలు తొలగుతాయని అన్నారు. జీవితాన్ని మెచ్చిన గురువు ఎక్కడా ఉండరని అందుకని కాల పరీక్షల్లో గెలవాలని పేర్కొన్నారు. మనిషిని మనిషిగా ప్రేమించాలని పేర్కొంటూ శివుడు ప్రేమ దేవుడని వ్యాఖ్యానించారు. జన్మకో శివరాత్రి అన్నారని శివ శివ అంటే మనలో ఎంతో ధైర్యం, విశ్వాసం పెరుగుతుందని అన్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవని అందులోని తెలుగు సంస్కృతి ఇంకా మహోన్నతమైనదని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో భాగంగా శివతాండవం పేరిట రోషిణి పెండ్యాల హావభావాలు పలికిస్తూ నృత్యంతో అందరినీ ఆకట్టుకుంది. ఇందులో తెలుగు ప్రముఖులు ఊరా లక్ష్మీ నరసింహారావు, డాక్టర్ సీఎంకె రెడ్డి, ఎం.ఆదిశేషయ్య, వి.కృష్ణారావు, జెకెరెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన



పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పళ్లిపట్టు: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వెలిగరంలో శనివారం నిర్వహించిన వైద్య పరీక్షల్లో 463 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తిరుత్తణి సబ్ డివిజన్ పరిధిలోని నందినది తీర ప్రాంతంలోని ఆర్కేపేట యూనియన్ సెంగట్టానూరు, పళ్లిపట్టుకు చెందిన 80 మంది పాడి రైతులు తమ పశువులను శిబిరానికి తీసుకొచ్చారు. పశుసంవర్ధక శాఖ సహాయ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్ ఆధ్వర్యంలో వైద్యులు బంధం మూగజీవులకు వైద్య పరీక్షలు చేశారు.

రేషన్ లబ్ధిదారుల ధర్నా



రేషన్ దుకాణం ఎదుట ధర్నా చేస్తున్న రేషన్ కార్డు దారులు

వేలూరు: తిరుపత్తూరు జిల్లా నాట్రంబల్లి సమీపంలోని బాచూరులోని రేషన్ దుకాణంలో పచ్చి, ఉప్పుడు బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను శుక్రవారం ఉదయం అందజేశారు. అయితే ఉప్పుడి బియ్యం నాసిరంగా ఉందని, ప్లాస్టిక్ బియ్యాన్ని అందజేశారని వీడియో తీసి వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. విషయం తెలుసుకున్న కార్డు దారులు అధిక సంఖ్యలో రేషన్ దుకాణం వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని బియ్యాన్ని పరిశీలించారు. రేషన్ దుకాణంలో కార్డు దారులకు అందజేస్తున్న బియ్యం ప్లాస్టిక్ బియ్యం కాదని.. శుద్ధి చేసిన బియ్యమని ప్రజలకు అవగాహన కల్పించారు. దీంతో స్థానికులు ధర్నాను విరమించారు.

ముమ్మరంగా ఇంటి పన్ను వసూలు



ఇంటి పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తిరువళ్లూరు: ఇంటి పన్ను వసూళ్లకు సంబంధించిన బకాయిలను మున్సిపాలిటీ అధికారులు ఇంటింటికీ వెళ్లి వసూలు చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. తిరువళ్లూరు మున్సిపాలిటీ పరిధిలో సుమారు 20 వేల నివాసాలు, 3,524 దుకాణాలు, 16 కల్యాణ మండపాలు, 30కి పైగా విద్యాసంస్థలు, వ్యాపార వాణిజ్య దుకాణాలు ఉన్నాయి. వీరు ఏటా ఇంటి, నీటి పన్నులు, సబ్‌వే మురుగు కాలువల కోసం పన్నులను చెల్లించాల్సి ఉంది. కొంత మంది పన్నులను సక్రమంగా చెల్లిస్తున్నా.. మరి కొందరు మాత్రం ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో మొండి బకాయిలుగా మారిపోతున్నాయి. దీంతో పాటు ఇటీవల పెరిగిన పన్నుల భారం సైతం ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపి చెల్లింపులకు ముందుకు రావడం లేదు. మార్చి మొదటి వారంలోగా పన్నులను చెల్లించాల్సి ఉన్నా ఇప్పటి వరకు కనీసం 50 శాతం కూడా పెరగకపోవడంతో మున్సిపాలిటీకి నిధుల కొరత సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో పన్ను వసూలు కోసం అధికారులు వినూత్న రీతిలో నిర్ణయం తీసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేయడం, మొండి బకాయిలుగా మారిన బిల్లులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించి వసూలు చేసే ప్రక్రియను శనివారం చేపట్టారు. 27 వార్డులకు ఒక్కో బృందాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక క్యాంపులు నిర్వహించి పన్ను వసూలు చేస్తున్నారు.

విద్యార్థుల ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థులు

అన్నానగర్: హాస్టల్‌లో నాసిరకం భోజనం వడ్డిస్తున్నారని ఆరోపిస్తూ పుదుకోట్టైలో కళాశాల విద్యార్థులు ధర్నాకు దిగారు. పుదుకోట్టైలోని మన్నార్ కళాశాల సమీపంలో ఆది ద్రావిడర్ సంక్షేమ కళాశాల విద్యార్థి వసతి గృహం నడుస్తోంది. కింగ్స్ కాలేజీకి చెందిన చాలామంది విద్యార్థులు ఈ హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందజేస్తున్న ఆహారం నాణ్యతగా లేదని, సబ్బులు తదితర వస్తువులను కొనుగోలు చేసేందుకు కూడా పాలనాధికారులు నిధులు మంజూరు చేయడం లేదని వాపోతున్నారు. శనివారం హాస్టల్‌కు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో కోడిగుడ్లు తీసుకుని అల్పాహారంగా వడ్డించిన అన్నం ప్లేట్లతో పుదుకోట్టై జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఆది ద్రావిడర్ సంక్షేమ శాఖ అధికారి కరుణాకరన్, రెవెన్యూ అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారితో చర్చలు జరిపారు. నాణ్యమైన ఆహారం అందజేస్తామని, మెనూ ప్రకారం ఆహారం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మా వీరన్‌లో పాటలో 500 మంది కళాకారులు



డాన్సర్లతో శివకార్తికేయన్

తమిళసినిమా: హీరో శివకార్తికేయన్ నటిస్తున్న తాజా చిత్రం తెలుగులో మహావీరుడు పేరుతో విడుదల కానుంది. శాంతి టాకీస్ పతాకంపై అరుణ్ విశ్వ భారీ ఎత్తున దీన్ని నిర్మిస్తున్నారు. దీనికి మండేలా చిత్రం ఫేమ్ మడోనా అశ్విన్ కథ, దర్శకత్వం వహిస్తున్నారు. దర్శకుడు శంకర్ వారసురాలు అతిథి శంకర్ నాయకిగా నటిస్తున్న ఈ చిత్రంలోని సీన్ ఆ సీన్ అనే పాట గ్లింప్సెస్‌ను శుక్రవారం ఉదయం విడుదల చేశారు. 30 సెకన్ల నిడివితో కూడిన ఈ పాటలో నటుడు శివకార్తికేయన్ ఎనర్జీ డాన్స్ చిత్రంపై ఆసక్తిని పెంచేస్తోంది. కాగా ఈ పాటలో 500కు పైగా నృత్య కళాకారులు 150 మందికి పైగా చిత్ర బృందం పాల్గొనడం విశేషం. గీత రచయితలు కపిలన్, లోకేష్ రాసిన ఈ పాటకు భరత్ శంకర్ సంగీత బాణీలు కట్టారు. శోబీ మాస్టర్ నృత్య దర్శకత్వం వహించారు. కాగా ఈ పాటలో చెన్నైకు చెందిన 500కు పైగా నృత్య కళాకారులను నటింప చేయడంపై చిన్ని ప్రకాష్, బాబు తదితరులు మావీరన్ చిత్ర కథానాయకుడు నటుడు శివకార్తికేయన్, దర్శకుడు మడోనా అశ్విన్, నిర్మాత అరుణ్ విశ్వకు అభినందనలు తెలిపారు. కాగా ప్రస్తుతం శివకార్తికేయన్, మిష్కిన్, సునీల్ పాల్గొంటున్న ఫైట్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు దర్శకుడు తెలిపారు.

కోలీవుడ్ టాక్స్

ఆదియోగి సేవలో సూపర్ స్టార్



తమిళసినిమా: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా సూపర్ స్టార్ రజనీకాంత్ తన సోదరుడు సత్యనారాయణతో కలిసి కర్ణాటక, చిక్కబల్లాపుర జిల్లాలోని ఆదియోగి దర్శనానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోయంబత్తూరు ఈషా యోగ మందిరం తరపున ఈఏడాది జనవరి 15 కర్ణాటక రాష్ట్రం చిక్కబల్లాపుర జిల్లాలోని నంది మలై (కొండ) పరీవాహక ప్రాంతంలో 112 అడుగుల ఎత్తయిన ఆదియోగి శిలా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కోయంబత్తూరులోని శివుని శిలా విగ్రహం మాదిరిగానే చిక్కబల్లాపురలో ఆదియోగి శిలా విగ్రహం ఉండడంతో భక్తులు వేల సంఖ్యలో తరలివస్తున్నారు. కాగా మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అశేష భక్తులు శనివారం నుంచే శివ దర్శనం చేసుకున్నారు. అదేవిధంగా నటుడు రజనీకాంత్ తన సోదరుడు సత్యనారాయణతో కలిసి ఆదియోగిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రజనీకాంత్ యోగేశ్వర లింగానికి విశేష పూజలు నిర్వహించారు. ఆ ఫొటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

ఇండోనేషియా ఆశ్రమంలో అమలాపాల్



అమలాపాల్

తమిళసినిమా: అమలాపాల్ ఈ పేరే ఓ సంచలనం. వివాదాలకు చిరునామా. నటన, ప్రేమ, పెళ్లి, విడాకులు, వివాదాలు, ఆరోపణలు, కేసులతో ఆమె నిత్యం సహవాసం చేస్తుంటారు. కేరళ భామ దక్షిణాది భాషల్లో కథానాయకిగా నటించి గుర్తింపు పొందారు. తమిళంలో మైనా చిత్రంతో వెలుగులోకి వచ్చిన ఈమె ఆ తరువాత ప్రముఖ హీరోల సరసన నటించారు. అదేవిధంగా నటిగా మంచి ఫామ్‌లో ఉండగానే దర్శకుడు విజయ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అయితే రెండేళ్లలోనే దర్శకుడు విజయ్ మనస్పర్థల కారణంగా విడిపోయి విడాకులు కూడా పొందారు. ఆ తరువాత నటిగా కొనసాగిస్తున్న అమలాపాల్ ఆ మధ్య నిర్మాతగానూ మారి కడావర్ అనే చిత్రాన్ని నిర్మించారు. కాగా నటిగా క్రేజ్ తగ్గడంతో తాజాగా ఆధ్యాత్మిక బాట పట్టినట్లు సమాచారం. క్రిస్టియన్ మతానికి చెందిన అమలాపాల్ ఇటీవల కేరళలోని ఓ హిందూ దేవాలయానికి వెళ్లారు. అయితే అక్కడి అర్చకులు, ఆలయ నిర్వాహకులు అనుమతించకపోవడంతో భంగపడ్డారు. అయితే తన ఆధ్యాత్మిక పర్యటనను మాత్రం ఆపలేదు. ఇటీవల తమిళనాడులోని పళని లోని కుమారస్వామి ఆలయానికి వెళ్ళి స్వామి దర్శనం చేసుకున్నారు. ప్రస్తుతం అమలాపాల్ ఇండోనేషియాలోని బాలి దీవికి వెళ్లి అక్కడ ఓ ఆశ్రమంలో బస చేశారు. అక్కడ ప్రకృతి సిద్ధమైన ఆహారాన్ని తీసుకుంటూ యోగా ధ్యానంలో నిమగ్నమయ్యారు. ఈ విషయాన్ని అమలాపాల్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసిన వీడియో ద్వారా వెల్లడించారు. ఆ వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

ఆయనంటే చాలా ఇష్టం



కబ్జా చిత్రంలో ఓ ఉపేంద్ర

తమిళసినిమా: నటుడు ఉపేంద్ర, శ్రియ జంటగా కన్నడంలో నటించిన చిత్రం కబ్జా. సుదీప్ ముఖ్య పాత్ర పోషించారు. కాగా నటి శ్రియ వివాహానంతరం నటించిన చిత్రం ఇది. కన్నడ దర్శకుడు ఆర్ చంద్రు స్వీయ దర్శకత్వంలో నిర్మించారు.. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం కన్నడం, తెలుగు, తమిళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ శుక్రవారం సాయంత్రం చెన్నైలో మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. దర్శక నిర్మాత చంద్రు, నటి శ్రియ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ.. ఇది స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1970 ప్రాంతంలో జరిగే గ్యాంగ్‌స్టర్ కథా చిత్రమని చెప్పారు. కేజీఎఫ్ చిత్రం చూసి తాను ఆశ్చర్యపోయానన్నారు. ఆ చిత్ర స్ఫూర్తితోనే కబ్జా చిత్ర కథను తయారు చేసినట్లు చెప్పారు. తను ఇంతకుముందు 11 చిత్రాలు రూపొందించానని ఇది తనకు 12వ చిత్రం అని చెప్పారు. నటుడు ఉపేంద్ర అంటే అభిమానమని, ఆయన చిత్రం చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అదే విధంగా సుదీప్ పాత్ర చిన్నదైనా చాలా ప్రాముఖ్యత కలిగి ఉంటుందన్నారు. నటి శ్రియ చిత్రంలో అద్భుతంగా నటించారని అన్నారు. నటి శ్రియ మాట్లాడుతూ.. తమిళనాడు చాలా నచ్చిందని.. చెన్నై అంటే చాలా ఇష్టం అని పేర్కొన్నారు. శివాజీ చిత్రంలో రజనీకాంత్ సరసన నటించడం మంచి అనుభవం అని తెలిపారు. ఆయన నటన, నిరాడంబరత, అందరితో కలిసి మెలిసి నడుచుకునే ప్రవర్తన స్ఫూర్తిదాయకమన్నారు. లైట్‌మ్యాన్ నుంచి అందరికీ నమస్కారం పెట్టే సంస్కారం రజనీకాంత్‌దే అన్నారు. అలాంటి వారితో నటించడానికి ఎవరికైనా ఇష్టమేనని తెలిపారు. తానూ మళ్లీ రజనీకాంత్‌కు జోడీగా నటించాలని కోరుకుంటున్నానన్నారు. ఇప్పుడు భాష భేదం లేదని.. మంచి కథా చిత్రాలు పాన్ ఇండియా స్థాయిలో ఉన్నాయని చెప్పారు. ఈ కబ్జా చిత్రం కూడా పాన్ ఇండియా చిత్రంగా విడుదల కానుందని, ఇందులో నటించటం మంచి అనుభవంగా పేర్కొన్నారు.

డ్రగ్స్ రహిత తమిళనాడు కోసం..



డ్రగ్స్ రహిత తమిళనాడు కోసం సంతకం చేస్తున్న ఐశ్వర్య రాజేష్

తమిళసినిమా: తమిళంలో చైతన్య చిత్రాలతో బిజీగా ఉన్న నటి ఐశ్వర్య రాజేష్. అదే విధంగా తెలుగు తదితర భాషల్లోనూ పేరు తెచ్చుకున్నారు. ఈమె తన సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ప్రారంభ దశలోనే కాక్కాముట్టై చిత్రంలో ఇద్దరు పిల్లలకు తల్లిగా నటించారు. ఆ తరువాత హీరోలకు చెల్లెలు, నటనకు అవకాశం ఉన్న పాత్రల్లో నటించి శభాష్ అనిపించుకున్నారు. ఇప్పుడు హీరోయిన్ ఓరియంటెడ్ కథా చిత్రాల స్థాయికి ఎదిగారు. ఇటీవల ఈమె నటించిన ది గ్రేట్ ఇండియన్ కిచెన్ చిత్రం మంచి ప్రశంసలను అందుకుంది. ముఖ్యంగా ఐశ్వర్య రాజేష్ నటనకు చిత్ర వర్గాల నుంచి అభినందనలు అందుకున్నారు. గ్లామరస్ పాత్రల వైపు మొగ్గకుండా పక్కింటి అమ్మాయి ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. ఐశ్వర్య రాజేష్ తాజాగా నటిస్తున్న చిత్రాల్లో స్వప్న సుందరి ఒకటి. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్ ఇటీవల విడుదల చేశారు. దీనికి సినీ వర్గాల నుంచి మంచి స్పందన వస్తోందని, యూనిట్ సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. పోస్టర్లు చూడగానే కథలో ఏదో కొత్త విషయం ఉందని భావన కలుగుతోందన్నారు. తాజాగా ఐశ్వర్య రాజేష్ మాదకద్రవ్య రహిత తమిళనాడు కోసం మద్దతుగా నిలిచారు. డీవైఎఫ్ఐ అనే సంస్థ మాదకద్రవ్య రహిత తమిళనాడు కోసం నో టూ డ్రగ్స్ పేరుతో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. దీనికి మద్దతుగా నటి ఐశ్వర్య రాజేష్ సంతకం చేశారు.

ఏటీఎం దొంగలు దొరికారు

- ఈ నెల 12న ఏటీఎంలు ధ్వంసం చేసి రూ.75 లక్షలు అపహరణ
- నిందితులు హర్యానా వాసులుగా గుర్తింపు
- రిమాండ్ నిమిత్తం వేలూరు సెంట్రల్ జైలుకు తరలింపు


నిందితులను కోర్టు నుంచి వేలూరు సెంట్రల్ జైలుకు తరలిస్తున్న పోలీసులు

వేలూరు: తిరువణ్ణామలై జిల్లాలో ఈ నెల 12వ తేదీ అర్ధరాత్రి నాలుగు ఏటీఎం కేంద్రాలను గ్యాస్ వెల్డింగ్ మిషన్ ద్వారా కాల్చివేసి రూ. 75 లక్షలు చోరీ చేసిన సంఘటన సంచలనం రేపింది. నిందితులను పట్టుకునేందుకు ఐదుగురు ఎస్పీలతో కూడిన తొమ్మిది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌లో ఇద్దరు, గుజరాత్‌లో ఆరుగురు, హర్యానాలో ఇద్దరు సహా మొత్తం పది మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. ముఠా సభ్యులు మహ్మద్ హారీఫ్ (35), ఆసాజీ (37)లను హర్యానా రాష్ట్రం మేవాట్ జిల్లాలో ఆ రాష్ట్ర పోలీసుల సాయంతో ప్రత్యేక పోలీస్ బృందం రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టింది. మహ్మద్ హారీఫ్ పలు సంచలనమైన విషయాలను తెలిపినట్లు తెలుస్తోంది. అందులో మహ్మద్ హారీఫ్ ఏటీఎం కేంద్రంలో నగదు నింపే వాహనంలో కొద్ది రోజులుగా పని చేసినట్లు.. ఆ సమయంలో నగదు ఏటీఎంలో ఎక్కడ ఉంటుంది.. వాటిని ఏ విధంగా నింపాలి అనే పూర్తి విషయాలు అతనికి తెలిసినట్లు గుర్తించారు. వీటితో పాటు ఇది వరకే రెండు చోట్ల ఏటీఎంలో చోరీ చేసినట్లు తెలిసింది. దీంతో మహ్మద్ హారీఫ్, ఆసాజీలను పోలీసులు విమానంలో శుక్రవారం రాత్రి చెన్నై తీసుకొచ్చారు. అక్కడి నుంచి తిరువణ్ణామలై పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అక్కడ ఐజీ కణ్ణన్, డీఐజీ ముత్తుస్వామి విచారణ జరిపారు.

అనంతరం శనివారం వేకువజామున ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేసి తిరువణ్ణామలైలోని ప్రధాన న్యాయమూర్తి దైవీగన్ ముందు హాజరుపరిచారు. ఆ సమయంలో ఇద్దరిని 15 రోజులు రిమాండ్ విధించారు. ఇద్దరిని వేలూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా నిందితులు ఇద్దరిని మూడు రోజులు పోలీస్ కస్టడికి తీసుకుని విచారణ జరపనున్నారు. అదే విధంగా కేజీఎఫ్‌లో అదుపులోకి తీసుకున్న ఇద్దరు, గుజరాత్‌లో అరెస్టు చేసి ఆరుగురిని శనివారం రాత్రికి తిరువణ్ణామలై తీసుకురానున్నారు. ఇదిలా ఉండగా ఏటీఎంలో చోరీ చేసిన రూ.75 లక్షలు ఎవరి దగ్గర ఉంది? ఎక్కడ దాచి ఉంచారు? అని విచారణ చేస్తున్నారు.

నేత్రపర్వంగా వెంకన్న రథోత్సవం

- నేడు చక్రస్నానంతో ముగియనున్న వార్షిక బ్రహ్మోత్సవాలు


గోవిందనామస్మరణలతో స్వామివారి దివ్యరథాన్ని లాగుతున్న స్వర్ణలతమ్మ


నాలుగు మాడవీధుల్లో విహరిస్తున్న శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు (ఇన్‌సెట్) రథోత్సవంలో విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి రథోత్సవం కనుల పండువగా సాగింది. కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన శనివారం స్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేతంగా దివ్యరథాన్ని అధిరోహించి భక్తులకు దర్శనం ఇచ్చారు. అంతకముందు ఉదయం స్వామి వారికి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం భక్తుల గోవిందనామ స్మరణలతో, భక్తజన బృందాల నడుమ రథోత్సవాన్ని ప్రారంభించారు. టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలత రథోత్సవంలో పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై వెంకన్న రాజసం

శనివారం రాత్రి స్వామి వారు అశ్వ వాహనంపై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు కటాక్షించారు. ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్లు చెంగల్రాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏవీఎస్‌ఓ విశ్వనాథం, వీఐ సురేష్‌రెడ్డితో పాటు ఆలయ సిబ్బంది తరఫున స్వామి వారికి వివిధ రకాలైన పండ్లు, పూలను సమర్పించి, సర్కారు హారతిని అందుకున్నారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో ఊంజల్ సేవను కనుల పండువగా నిర్వహించారు.

నేడే చక్రస్నానం

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన చక్రస్నానం కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 9.40 నుంచి 9.50 గంటల మధ్య ఆలయ పుష్కరిణిలో వైఖానస ఆగమోక్తకంగా నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య జరిగే ధ్వజవరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

అలరిస్తూ..ఆకట్టుకుంటూ..


నందిపై శివుని ప్రతిమ


ఆకట్టుకుంటున్న శివలింగం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్ల ఊరేగింపులో వాహన సేవల ముందు వివిధ కళారూపాలు ప్రదర్శించి భక్తులను ఆకట్టుకున్నారు. నిజ ఏనుగును తలపించేలా ప్రతిమలు ప్రదర్శించారు. కోలాటం, చెక్కభజనలు, వివిధ రకాల వాయిద్యాలతో భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ఓలలాడించారు. శివలింగం, నందిపై పరమేశ్వరుడు ప్రతిమ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.


మహిళల కోలాటాలు


వేదపారాయణం చేస్తున్న పండితులు

ద్విచక్రవాహన దొంగల అరెస్ట్

- 20 బైక్‌లు స్వాధీనం
- మీడియా సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసమూర్తి

చిత్తూరు అర్బన్: బైక్ కనబడితే చాలు రెప్పపాటు కాలంలో ఎత్తుకెళ్లే ఓ ముఠాను చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి శనివారం ముఠా అరెస్ట్ చూపి వివరాలను వెల్లడించారు. ఇటీవల చిత్తూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పలు ద్విచక్రవాహనాలు చోరీ కావడంతో పలువురు బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తమిళనాడులోని గుడియాత్తం తాలూక ఏరికుత్తి గ్రామానికి చెందిన ప్రకాష్ (30), శరవణమూర్తి(44)ని శుక్రవారం పీవీకేఎన్ కళాశాల సమీపంలో పట్టుకున్నారు. చోరీ చేసిన వాహనాలను వీరు తమిళనాడులోని వివిధ ప్రాంతాల్లో విక్రయించినట్లు సమాచారం సేకరించారు. కొన్ని వాహనాలను ముళ్ల పొదల్లో పడేసినట్లు గుర్తించారు. రూ.15 లక్షలు విలువచేసే 20 ద్విచక్రవాహనాలను వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరికొంతమంది ఉన్నారని, పట్టుబడిన ఇద్దరు ముద్దాయిలపై తమిళనాడులోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. అనంతరం ఈ కేసు ఛేదించిన పోలీసు సిబ్బందిని ఆయన రివార్డులతో అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐలు రమేష్‌బాబు, వసంత, ప్రసాద్, సిబ్బంది రమేష్ సురేష్, సుధాకర్, రేణువాసులు, రామకృష్ణ, మదన్ తదితరులు ఉన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

- పండుగపూట కురింజల్లంలో విషాదం

వరదయ్యపాళెం: గొర్రెలను కడిగేందుకు చెరువు వద్దకు వెళ్లిన యువకుడు కాలు జారిపడి చెరువులో మునిగి దుర్మరణం చెందిన ఘటన మండలంలోని కురింజల్లంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కురింజల్లంకు చెందిన ఆనందయ్య కుమారుడు ప్రకాష్ (24) శ్రీసిటీలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నాడు. సెలవు కారణంగా శనివారం ఉదయం గ్రామ సమీపంలోని చెరువు వద్దకు గొర్రెలను కడిగేందుకు తీసుకెళ్లాడు. గొర్రెలను చెరువు వద్ద దించి కడుగుతుండగా కాలు జారి చెరువులోకి జారిపోయాడు. ఈత రాని ప్రకాష్ నీటిలో మునిగి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు.

మాజీ అదనపు ఎస్పీకి టోకరా

-స్థలం విక్రయించిన ఇద్దరి అరెస్టు

తిరువొత్తియూరు: మాజీ ఎస్పీ వద్ద రూ.1.50 కోట్లు స్థల మోసం చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై ట్రిప్లికేన్‌కు చెందిన దయానిధి (62) మాజీ అదనపు ఎస్పీ. ఈయనకు మాంగాడు శ్రీచక్రనగర్‌లో రూ.1.20 కోట్ల విలువైన స్థలం ఉంది. పట్టాభిరామ్ భారతీయార్ నగర్‌కు చెందిన శివరాజ్ (47), చెన్నై విరుగంబాక్కం పచ్చయమ్మన్ ఆలయం వీధికి చెందిన లోకనాథన్ (54) దయానిధి వద్ద ఓ ప్రతిపాదన పెట్టారు. సదరు స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మిస్తామని.. వచ్చే ఆదాయంలో 40 శాతం మీకు, 60 శాతం మాకు అని ఒప్పందం కుదుర్చుకున్నారు. అందుకు దయానిధి సమ్మతం తెలిపారు. దీంతో శివరాజ్, లోకనాథన్ ఇద్దరు దయానిధికి చెందిన స్థలాన్ని ఆయనకు తెలియకుండా కొందరికి రూ.1.45 లక్షలకు విక్రయించారు. దయానిధికి లాభంలో భాగం ఇవ్వకుండా మోసం చేశారు. దీనిపై దయానిధి ఆవడి పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఉన్న సెంట్రల్ క్రైమ్ విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్ కేసు నమోదు చేసి శివరాజు, లోకనాథన్‌లను అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు.

శ్రీసిటీలో సంగీత గేయధార

వరదయ్యపాళెం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీసిటీలో శ్రీవాణి ఆధ్యాత్మిక సాహితీ వేదిక ఆధ్వర్యంలో శనివారం ప్రముఖ పండితుడు డాక్టర్ వెలుగోటి భాస్కర సాయికృష్ణ యాచేంద్ర సంగీత గేయధార కార్యక్రమం నిర్వహించారు. వీరికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. సంగీత సాహిత్యం ప్రధానంగా సాగిన ఈ కార్యక్రమంలో యాచేంద్ర అప్పటికప్పుడే అనువుగా రాగతాళ గేయాలను ఆలపించారు. శివపార్వతుల దాంపత్య వైశిష్ట్యాన్ని ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా శ్రీసిటీ సృష్టికర్త రవీంద్ర సన్నారెడ్డి సాధించిన విజయాన్ని మెచ్చుకుంటూ ఆయన తండ్రి ఇచ్చే ఆశీస్సులను గేయరూపంలో మనోహరంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో పలువురు గాయకులు, పండితులు శోభారాజ, కుసుమకుమారి, పనతుల సుబ్రమణ్యం, జేకేరెడ్డి, వెంకటరామజోగి, పల్లేటి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదృశ్యమైన యువకుడు మృతి

అన్నానగర్: ఆలంగుడిలో అదృశ్యమైన యువకుడు శనివారం మృతిచెందాడు. వివరాలు.. పుదుకోట్టై జిల్లా ఆలంగుడి సమీపంలోని మేల నెమ్మకోట్టైకి చెందిన చిన్నదురై కుమారుడు మణికంఠన్ (22) ఈ నెల 5వ తేదీ నుంచి కనిపించడంలేదని తండ్రి ఆలంగుడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం ఆలంగుడిలోని సంపిరాణి కొలనులో మణికంఠన్ శవమై కనిపించాడని సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పుదుకోట్టై ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. మణికంఠన్ చెరువులో మునిగి చనిపోయాడా? లేక ఎవరైనా చంపి ఇక్కడ పడవేశారా? అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

కంటైనర్‌లో షూలు చోరీ

-ఇద్దరి అరెస్టు

